
చిన్నారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న డాక్టర్ అపర్ణ

మై స్కూల్ ఇటలీ నిర్వాహకులపై దౌర్జన్యం

● సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు

బేగంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని రోడ్డు నెంబర్.25లో స్థలాన్ని లీజుకు తీసుకుని నిర్వహిస్తున్న మై స్కూల్ ఇటలీ విద్యాసంస్థ ప్రాంగణంలో స్థల యజమాని రోనక్ యార్‌ఖాన్ సహా అతడి అనుచరులు దౌర్జన్యం చేస్తున్నారని ఇటలీకి చెందిన ఎన్నారై డాక్టర్ వల్లూరు అపర్ణ సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణిలో ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే స్పందించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. బాధితురాలికి న్యాయం చేయాలని సైబరాబాద్ కమిషనర్‌కు సూచించారు.


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

ప్రభుత్వ స్థలం ఉపయోగించాలని ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 27 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ డివిజన్ పద్మాలయ అంబేడ్కర్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని స్థానికుల అవసరాలకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ కోరారు. మంగళవారం ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. బస్తీలో ఉన్న స్థలాన్ని పక్క నియోజకవర్గం కార్వాన్ ఆర్‌టీఏ కార్యాలయానికి కేటాయించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ప్రభుత్వ కళాశాల లేదని, అలాగే ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న ఎంతోమంది లబ్ధిదారులు ఉన్నారని వారి కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆర్‌టీఏ కార్యాలయానికి కేటాయిస్తూ ఇచ్చిన ఉత్తర్వును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అమెరికా వీసా పేరుతో మోసం

బంజారాహిల్స్, మే 27 (ఆంధ్రజ్యోతి): అమెరికా వీసా పొందేందుకు దొడ్డి దారి ఉందని అందుకు కొంత ఖర్చవుతుందని ఓ వ్యక్తి డబ్బు తీసుకున్నాడు. తీరా ఇంటర్వ్యూకు వెళ్లగా అక్కడి అధికారులు వీసా ఇచ్చేందుకు నిరాకరించడంతో పాటు సరైన కారణాలు లేనిది మరోసారి దరఖాస్తు చేసుకోవద్దని చెప్పారు. మోసగించిన వ్యక్తిని డబ్బు తిరిగి ఇచ్చేయాలని కోరగా, 'వృత్తిపరంగా అబద్ధాలు చెబుతాం.. నమ్మి మోసపోవడం మీదే తప్పు' అంటూ బుకాయించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలికి చెందిన ప్రణయ్ యాదవ్ విద్యార్థి. ఓ విద్యాసంస్థలో మాస్టర్స్ చదువుతున్నాడు. అమెరికా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో బంజారాహిల్స్‌కు చెందిన సయ్యద్ బషీర్ అహ్మద్ అనే కన్సల్టెంట్‌ను కలిశాడు. అమెరికా వీసా ఇప్పించేందుకు దొడ్డి దారి ఉందని కొంత ఖర్చు పెట్టుకుంటే స్టాపింగ్ సజావుగా జరుగుతుందని నమ్మబలికాడు. ఇందుకు రూ. 50 వేలు ఖర్చు అవుతుందన్నాడు. ఇది నమ్మిన ప్రణయ్ రూ.20 వేలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. వీసా ఇంటర్వ్యూకు వెళ్తుండగా మరో పదివేలు ఇచ్చాడు. వీసా ఇంటర్వ్యూలో అక్కడి అధికారులు అడిగిన ఎనిమిది ప్రశ్నలకు సమాధానం చెప్పాడు. అయినప్పటికీ అధికారులు వీసా ఇచ్చేందుకు నిరాకరించడంతో పాటు ప్రత్యేక కారణాలు ఉంటేనే మరోసారి ఇంటర్వ్యూకు రావాలని హెచ్చరించారు. బషీర్ మోసగించినట్టు గుర్తించిన బాధితుడు డబ్బు తిరిగి ఇవ్వాలని ఫోన్ చేశాడు. డబ్బు కోసం అబద్ధాలు చెబుతాం.. నమ్మి మోసపోవడం మీ తప్పు డబ్బు తిరిగి ఇచ్చేది లేదంటూ చేతులెత్తేశాడు. ప్రణయ్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి ఆత్మహత్య

బంజారాహిల్స్, మే 27 (ఆంధ్రజ్యోతి): గృహిణి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిలింనగర్ దుర్గాభవానీనగర్‌కు చెందిన బుజ్జి, మాల్యా దంపతులకు నలుగురు పిల్లలు. ఈనెల 26న మాల్యా, పిల్లలు పనిమీద బయటకు వెళ్లారు. వీరి ఇంటి పక్కనే నివాసముండే బుజ్జి సోదరుడు తిరుమలరావు బయటకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తూ సోదరిని పలుకరిద్దామని తలుపు కొట్టాడు. ఎవరూ తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఆమె ఉరేసుకొని కనిపించింది. స్థానికుల సహాయంతో తలుపులు పగులకొట్టి లోపలికి వెళ్లి ఆమెను పరిశీలించగా అప్పటికే మరణించింది. బుజ్జి మద్యానికి అలవాటు పడిందని, వారం రోజులుగా తాము తాగకుండా అడ్డుకుంటున్నామని మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని తిరుమలరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు నిలిపిన వ్యక్తిపై దాడి

యూసుఫ్‌గూడ, మే 27 (ఆంధ్రజ్యోతి): అనుమతితో పార్కింగ్ స్థలంలో కారును నిలిపిన వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ కె.రమణా రెడ్డి మధురానగర్‌లోని గాయత్రీ రెసిడెన్షియల్ ప్లాట్ నెంబర్.108 యజమాని సత్యనారాయణరాజు అనుమతితో కొంతకాలంగా కారును పార్క్ చేస్తున్నాడు. యజమాని కుమారుడు సందీప్ అసభ్యంగా మాట్లాడుతూ కారుపై దాడి చేశాడు. రమణారెడ్డిని దుర్భాషలాడుతూ దాడి చేశాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నమాజ్‌కు వెళ్తుండగా..

బంజారాహిల్స్, మే 27 (ఆంధ్రజ్యోతి): నమాజ్‌కు వెళ్తుండగా ఓ వ్యక్తి అడ్డుకొని దాడి చేశాడు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10 జహీరానగర్‌కు చెందిన ముజీబ్ యూఆర్ రెహ్మాన్ ఈనెల 26న ప్రార్థన చేసుకునేందుకు మసీదుకు వెళ్తుండగా మహ్మద్ సోహైల్ అడ్డగించి దాడి చేసి గాయపర్చి పారిపోయాడు. సోహైల్ యేడాది కాలంగా తనను బెదిరించడంతోపాటు చంపేందుకు తిరుగుతున్నాడని, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముజీబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం కార్డుతో నగదు డ్రా

యూసుఫ్‌గూడ, మే 27 (ఆంధ్రజ్యోతి): ఒకరి ఏటీఎం కార్డుతో మరో వ్యక్తి నగదు డ్రా చేశాడు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏజీకాలనీ నేతాజీనగర్‌కు చెందిన పర్వీబాను ఎస్‌ఆర్‌నగర్ మెట్రోస్టేషన్ వద్ద ఎస్‌బీఐ ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వెళ్లారు. అప్పుడు సాంకేతిక లోపం ఉందని చెప్పి పక్కన ఉన్న వ్యక్తి కార్డు తీసుకొని నేరుగా రూ.40 వేలు విత్‌డ్రా చేశారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆన్‌లైన్‌లో సట్టా ఆడుతున్న వ్యక్తి

● పోలీసులు చూసి పారిపోయేందుకు యత్నం

బంజారాహిల్స్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో సట్టా ఆడుతున్న వ్యక్తి పోలీసులు చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. చివరకు పోలీసులకు చిక్కాడు. హకీంబాబా దర్గాలో ఆన్‌లైన్ సట్టా బెట్టింగ్ జరుగుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈనెల 26న దాడులు చేయగా పోలీసుల రాకను గమనించిన ఓ వ్యక్తి అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ప్రశ్నించగా ఫిలింనగర్ వినాయకనగర్‌కు చెందిన పూలె శేఖర్‌గా గుర్తించారు. భారత్ మట్కాలో బెట్టింగ్ పెడుతున్నట్టు తేలింది. ఫిలింనగర్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని సెల్‌ఫోన్, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనం నిర్మించారు..

వదిలేశారు..

● ఉమ్మడి రాష్ట్రంలో నిధులు మంజూరు

● విద్యాశాఖ వద్దంటున్నా రూ.30 లక్షలు ఖర్చు

బంజారాహిల్స్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రం ఉండగా క్షణాల్లో లక్షల నిధులు మంజూరై ఆరు నెలల్లో పనులు చకచకా పూర్తయ్యాయి. హమ్మయ్య ఇక స్కూల్ అందుబాటులోకి వస్తుందని బస్తీవాసులు అనుకున్నారు. 12 సంవత్సరాలుగా ఆ భవనం ఉపయోగంలోకి రాలేదు. బస్తీ మధ్యలో ఉన్న ఈ భవనం ఇప్పుడు మందుబాబులు, సంఘ విద్రోహ శక్తులకు అడ్డాగా మారింది.

జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ బండారు బాల్‌రెడ్డినగర్‌లో ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించారు. విద్యాశాఖ అవసరం లేదంటున్నా నిధులు ఉన్నవి కాబట్టి అప్పటి పాలకులు వాటిని ఎలాగైనా ఖర్చు చేయాలని ఏకంగా కొత్త పాఠశాల కోసం రూ.30 లక్షలు ఖర్చు చేశారు. అక్కడ స్కూల్ అవసరం లేకున్నా ఆగమేఘాల మీద పనులు పూర్తి చేసి ఇప్పుడు దానిని నిరుపయోగంగా వదిలేశారు.


గదుల్లో అపరిశుభ్ర వాతావరణం

సర్వశిక్ష అభ్యాన్ నిధులతో..

బండారు బాల్‌రెడ్డినగర్, వినాయకనగర్ బస్తీలు కలిసే ఉంటాయి. ఇక్కడి విద్యార్థుల కోసం వినాయకనగర్‌లో ఓ పాఠశాల ఉంది. దాదాపు 300 మంది విద్యార్థులు ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో సర్వశిక్ష అభియాన్ కింద స్కూల్ భవనం నిర్మించేందుకు నిధులు అప్పటి పాలకుల వద్ద మిగిలిపోయాయి. నిధులు వెనక్కి వెళ్తే తిరిగి రావని స్కూల్ భవనం కోసం స్థలం అన్వేషించారు. బండారు బాల్‌రెడ్డినగర్‌లో 250 గజాల ఖాళీ స్థలం ఉండడంతో అందులో భవనం నిర్మించాలని నిర్ణయించారు. దీనికి విద్యాశాఖ అభ్యంతరం చెప్పింది. అయినా, వినిపించుకోకుండా అప్పటి పాలకులు రూ.30 లక్షల నిధులు మంజూరు చేసి పనులను గుత్తేదారుకు అప్పగించారు. ఆరు నెలల్లోనే నాలుగు అంతస్థుల భవన నిర్మాణం పూర్తయింది. ఇందులో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని పాలకులు ప్రకటించారు. ఇంతలో రాష్ట్ర విభజన జరగడం, ఎన్నికలు రావడంతో ఈ భవనం గురించి మరిచిపోయారు.


రూ.30 లక్షలు వెచ్చించి నిర్మించిన పాఠశాల భవనం

మందుబాబులకు అడ్డాగా..

భవనం గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో రాత్రి కాగానే మందుబాబులు భవనంలోకి వచ్చి చేరుతున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు పీకల దాకా తాగి అక్కడే తూలి పడిపోతున్నారు. కొంతమంది బస్తీకి చెందిన పిల్లలు మరుగుదొడ్ల కింద భవనంలో గదులను ఉపయోగించుకుంటున్నారు. దీంతో భవనం చుట్టుపక్కల అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ముక్కుపుటాలదిరే దుర్వాసన వ్యాప్తి చెందుతోంది. ఈ భవనంలో పాఠశాల లేదా ఆస్పత్రిని నెలకొల్పాలని స్థానికులు మంత్రులకు వినతి పత్రాలు సమర్పించినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ఈ భవనంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

రాత్రి బయటకు రావాలంటే భయం



రాత్రి కాగానే భవనంలోకి పోకిరీలు చేరి నానా అల్లరి చేస్తున్నారు. మద్యం తాగి ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే కొట్టడానికి మీదకి వస్తున్నారు. రాత్రి సమయంలో బయటకు రావాలంటే భయమేస్తుంది. ప్రభుత్వం భవనం నిరుపయోగంగా వదిలేయకుండా ప్రజాఉపయోగ కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుంది.

\- రమ, స్థానికురాలు

ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి



లక్షల రూపాయలు వెచ్చించి భవనం నిర్మించారు. ఇప్పుడు ఖాళీగా వదిలేసారు. పేదల కోసం ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేస్తే బాగుంటుంది. చిన్న రోగం వచ్చినా ప్రైవేట్ దవాఖానాలకు వెళ్లాల్సి వస్తుంది. ఈ భవనం బాగు చేసి ఆరోగ్యం కేంద్రం పెట్టడం వల్ల మా బస్తీతో పాటు మిగతా వారికి ఉపయోగంగా ఉంటుంది.

\- నీలవేణి, స్థానికురాలు

ప్రజలకు ఉపయోగపడేలా చూడాలి



భవనాన్ని బాగు చేసి ప్రజలకు ఉపయోగపడేలా ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది. ముప్పై లక్షలు వెచ్చించి ఖాళీగా వదిలేశారు. భవనంలో గదులు విశాలంగా ఉన్నాయి. ఆస్పత్రి, పాఠశాల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుంది. దీనిపై పాలకులు కలుగ చేసుకోవాలి. లేదంటే భవనం ఎందుకు పనికిరాకుండా పోతుంది.

\- మధు, స్థానికుడు

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

● 1.1 కిలోల గంజాయి స్వాధీనం

అమీర్‌పేట, మే 27 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట ప్రకృతి చికిత్సాలయం సమీపంలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్పత్రి చుట్టుపక్కల గంజాయి విక్రయాలు కొనసాగుతున్నాయన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని సోదాలు చేయగా, అతడి వద్ద 1.1 కిలోల గంజాయి లభించింది. గంజాయితో పట్టుబడ్డ వ్యక్తి మూసాపేటకు చెందిన డోలా మధుసూదన్(33)గా గుర్తించారు. గతంలో కూడా గంజాయి విక్రయిస్తూ రెండుసార్లు పట్టుపడ్డాడని, కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

రుణం ఇప్పిస్తామని మోసం

● ఇద్దరిపై కేసు నమోదు

అమీర్‌పేట, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో పరిచయమైన ఇద్దరు వ్యక్తులు రుణం ఇప్పిస్తామని చెప్పి ఓ మహిళ వద్ద రూ.50 వేలు తీసుకుని ఉడాయించారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట పోలీస్‌లైన్ గన్‌బజార్‌కు చెందిన శ్రీ థెరిస్సా డిక్రుజ్ రూ.50 లక్షల రుణం అవసరం పడడంతో రుణం కోసం ఆన్‌లైన్‌లో వెతికింది. జడ్డారెడ్డి అనే వ్యక్తి పరిచయమై కావాల్సిన రుణం ఇప్పిస్తానని చెప్పాడు. రుణం పొందాలంటే కొన్ని పత్రాలు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పి దాస్ అనే వ్యక్తితో కలిసి మహిళ ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉన్న పత్రాలతో పాటు ఆమెను వెంట తీసుకుని అమీర్‌పేటకు వచ్చాడు. హరి దోసె హోటల్ వద్ద కూర్చుని మహిళ వద్ద ఉన్న పత్రాలు తీసుకుని ప్రాసెసింగ్ కోసం రూ.50 వేలు కావాలని అడగడంతో ఇచ్చింది తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ చేసి ఉండడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫతేనగర్ వంతెన మెట్లు తొలగింపు..!

● ప్రమాదకరంగా మెట్లు.. ఇటీవల ఇద్దరికి గాయాలు

హైదరాబాద్ సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన ఫతేనగర్ వంతెన మెట్లను హైడ్రా కూల్చివేసింది. వంతెన నుంచి కిందకు దిగుతుండగా సోమవారం మెట్లు విరిగిపడడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో వంతెన మెట్లను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడారు. ప్రతీ ఆదివారం సనత్‌నగర్‌లో సంత జరుగుతుందని, ఆ సమయంలో వందలాది మంది మెట్ల మార్గం వినియోగిస్తారని చెప్పారు. శిథిలావస్థకు చేరిన మెట్లపై రాకపోకలు ప్రమాదకరమని, వాటిని తొలగించాలని ఆదేశించారు. దీం తో వెంటనే వంతెనకు ఆనుకొని ఉన్న మెట్లను తొలగించారు. నగరంలోని ఇతర ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన నిర్మాణాలను స్ట్రక్చరల్ ఇంజనీర్లతో తనిఖీ చేయించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.


వంతెన వద్ద మెట్లను పరిశీలిస్తున్న రంగనాథ్


తెలంగాణ జెన్‌కో సీఎండీగా బాధ్యతలు చేపట్టిన ఎస్.హరీష్‌కు విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సభ్యులు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య, ఉపాధ్యక్షుడు నాజర్ షరీఫ్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు వి.పరమేష్, స్వామి, రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ పి.అనిల్, కొరడాల వెంకటేశ్వర్లు, మధుసూదన్, రామారావు, రాజశేఖర్, అపర్ణ పాల్గొన్నారు.

● హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

సీఎం ప్రజావాణిని సందర్శించిన అమెరికా పారిశ్రామికవేత్తలు

బేగంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని పారిశ్రామికవేత్తలైన పానిస్ ఎంఎస్‌సీ సంస్థ సీఎఫ్‌వో రాబర్ట్ హాల్, అమెరికా మ్యాక్స్‌సూర్ సంస్థ ప్రెసిడెంట్ శ్రీక్ సూగోడ్, అమెరికా ఐసోవిజ్ సంస్థకు చెందిన సీడీవో చరణ్‌గుంటీలు సీఎం ప్రజావాణిని సందర్శించారు. మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో జరిగిన సీఎం ప్రజావాణికి వచ్చిన అమెరికా పారిశ్రామిక వేత్తలు ప్రజావాణి పనితీరును పరిశీలించారు. ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించడం, హెల్ప్ డెస్క్, ఎన్నారైల కోసం ఏర్పాటు చేసిన ప్రవాసీ ప్రజావాణి డెస్క్‌లను పరిశీలించారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి దగ్గర ఉండి ప్రజావాణి నిర్వహణ తీరును వివరించారు. స్టేట్ నోడల్ అధికారి దివ్యతో కూడా భేటీ అయ్యారు. సీఎం ప్రజావాణితో ప్రజల సమస్యలు సత్వరంగా పరిష్కారం అవుతున్నాయని, సీఎం ప్రజావాణి పనితీరు ఎంతో బాగుందని అమెరికన్లు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అమెరికన్ పారిశ్రామికవేత్తలను చిన్నారెడ్డి సత్కరించారు.

● 243 దరఖాస్తులు..

మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణికి మొత్తం 243 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలకు 31, రెవెన్యూ 55, మున్సిపల్ 16, హోంశాఖ 14, ఇందిరమ్మ ఇళ్లకు 57, ప్రవాసీప్రజావాణికి 12, ఇతర శాఖలకు సంబంధించి 58 దరఖాస్తులు వచ్చినట్లు అధికారి తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.



చిన్నారెడ్డి, దివ్యను కలిసిన అమెరికా పారిశ్రామికవేత్తలు

న్యాయవాదులకు రక్షణ చట్టం తేవాలి

పంజాగుట్ట, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో న్యాయవాదులపై రోజురోజుకూ దాడులు పెరుగుతూనే ఉన్నాయని హైకోర్టు సీనియర్ న్యాయవాది భానుమూర్తి బాల ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఒక కమిటీ వేసి న్యాయవాదులపై దాడులు ఎందుకు జరుగుతున్నాయో చర్చించాలని అన్నారు. దాడులను అరికట్టడానికి న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదిగా పని చేయడమే తమ తప్పా, తామే ఎందుకు చావాలని అన్నారు. బాధితులకు సత్వర న్యాయం కోసం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అన్నిరంగాల్లో భారత్ పురోగతి

రాయదుర్గం, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మందగమనం కొనసాగుతుంటే భారత్ అన్ని రంగాల్లో స్థిరమైన పురోగతి సాధిస్తుందని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి.అనంత నాగేశ్వరన్ అన్నారు. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ, జాతీయ గణాంకాల కార్యాలయం, ఐఎస్‌బీ, ఇన్‌కార్పొరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తాధ్వర్యంలో 2023-24 వార్షిక సర్వే డేటా ఫలితాలపై మంగళవారం ఐఎస్‌బీలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. తయారీ రంగంలో పటిష్ఠమైన మూలధన వ్యయంతో సంస్థలు, మహిళా వ్యవస్థాపక వృద్ధిలో పురోగతి సాధిస్తుందన్నారు. ఇన్ కార్పొరేటెడ్, వ్యవసాయేతర రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధిస్తున్నామని ఈ సర్వే గణాంకాల డేటా వెల్లడిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న అనిశ్చితి యుగంలో భారత ప్రభుత్వ విధాన పరమైన సంస్కరణలు రూపొందించటానికి ఇటువంటి వివరణాత్మకమైన డేటా ఎంతో కీలకంగా మారుతుందన్నారు. గణాంక కార్యక్రమాల కార్యదర్శి డాక్టర్ సౌరబ్‌గార్గ్ మాట్లాడుతూ, ప్రభుత్వం పటిష్ఠమైన పురోగతికి అన్ని రంగాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించిన గణాంకాల డేటా భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ డేటాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


డాక్టర్ అనంత నాగేశ్వరన్

వైద్య సంస్థలపై చర్యలు తీసుకోవాలి

పంజాగుట్ట, మే 27 (ఆంధ్రజ్యోతి): చర్మం, జుట్టు, వెల్నెస్ రంగంలో వైద్యులు లేకుండా, అర్హత లేని టెక్నీషియన్‌ల ద్వారా వైద్యం చేయిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ క్రీడాకారిణి, ఉమెన్స్ వెల్నెస్ కోచ్, సామాజిక కార్యకర్త పూర్ణిమ మండవ డిమాండ్ చేశారు. నకిలీ వైద్యులతో జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం సేవారంగంలో ఉందని, ఈ రంగంలో ఉన్న వారు ఎంతో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కొన్ని రోజులుగా నకిలీ వైద్యులపై తాము పోరాటం చేస్తున్నామన్నారు. ప్రజారోగ్యంతో అత్యంత జాగ్రత్తగా ఉండాలని అన్నారు. సమావేశంలో శ్రీనివాస్, పవన్ కుమార్, రాఘవేంద్ర, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణిమ మండవ


మాజీ ప్రధాని నెహ్రూ వర్ధంతిని అమీర్‌పేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజారాజేశ్వరీ, రజనీకాంత్, రవీందర్, నవీన్ రాజ్, గోవింద్ రాజ్, నరేష్, సత్యనారాయణ యాదవ్ తదితరులు నివాళులర్పించారు


నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహ్మద్ అజారుద్దీన్, నాయకులు నవీన్ యాదవ్, అసదుద్దీన్, భవాని శంకర్, దూడల రవిగౌడ్ తదితరులు

ఎంఎస్‌ఎంఈ సెక్టార్‌లోని సమస్యలను పరిష్కరించాలి

బేగంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎంఈ సెక్టార్‌లోని ట్రేడర్లు, టెక్స్‌టైల్ ఇండస్ట్రీల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర మంత్రి జితేన్‌రామ్ మాంజీ అన్నారు. మంగళవారం టూరిజం ప్లాజాలో తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంఎస్‌ఎంఈల తరహాలో ట్రేడర్లకు కూడా సబ్సిడీ బ్యాంక్ రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కేంద్ర మంత్రిని ఛాంబర్ అధ్యక్షుడు ప్రకాశ్, ప్రతినిధి సతీష్ కోరారు. ఆన్‌లైన్ ప్లాట్ ఫాం ప్రభావం వల్ల మీడియం, స్మాల్ ట్రేడర్లకు నష్టం జరుగుతుందని, వారి కోసం ఓ ప్లాట్ ఫాంని రూపొందించాలని వారు కోరారు.

గోడకేసి కొట్టి.. ఆ పై గొంతు నులిమి

● భర్తను హత్య చేసిన భార్య.. కేసు నమోదు

వనస్థలిపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): భర్తను గోడకేసి కొట్టి.. ఆపై గొంతు నులిమి హత్య చేసిందో మహిళ. అనంతరం ప్రమాదవశాత్తూ చనిపోయాడని పోలీసులతో సహా అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వనస్థలిపురం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం భావత్‌తండాకు చెందిన సభావత్ కిషన్ నాయక్(40), శిరీష దంపతులు వనస్థలిపురంలో నివాసముంటున్నారు. వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో శిరీషకు మరో వ్యక్తితో అక్రమ సంబంధం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కిషన్ నాయక్ తన భార్య శిరీషను మందలించాడు. రెండు నెలల క్రితం వనస్థపురంలోని హిల్‌కాలనీలో అద్దెకు ఇల్లు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం మద్యం తాగిన కిషన్ నాయక్ తన భార్య పనిచేసే వద్దకు వెళ్లి ఇంటికి తీసుకువచ్చాడు. ఈ క్రమంలో మరోసారి ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తురాలైన శిరీష భర్త కిషన్ నాయక్‌ను గట్టిగా గోడకేసి కొట్టింది. అంతటితో ఆగకుండా ఆయన గొంతును గట్టిగా నులిమి హత్య చేసింది. ఆపై అంబులెన్స్‌లో వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లింది. కిషన్ నాయక్‌కు పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కిషన్ నాయక్ మొదటి భార్య కూతురు బిందు తన తండ్రిని శిరీష చున్నీతో హత్య చేసిందని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బిందు ఫిర్యాదు మేరకు శిరీషపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు, రక్తపు మరకలు లేవని వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశిరెడ్డి తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.


కిషన్‌నాయక్(ఫైల్)

లాల్‌బజార్ మహంకాళి ఆలయంలో అమావాస్య పూజలు, అన్నదానం



అన్నదానం చేస్తున్న మాజీ బోర్డు సభ్యురాలు భాగ్యశ్రీ

తిరుమలగిరి మే 27(ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్ మహంకాళి దేవాలయంలో అమావాస్య సందర్భంగా అమ్మవారికి మహంకాళి అమావాస్య అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో యశ్వంత్‌కుమార్, దాతల సహాయంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ ప్రతి అమావాస్యకు అన్నదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు ప్యారసాని గౌరీశంకర్, బోర్డు మాజీ సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీ, ఎర్రోళ్ల రుక్మయ్య, పి.రాజు, చిన్నన్న, సంతోష్, వేణుగోపాల్, శ్రీను, కమలేష్, రాగిణి, లావణ్యలు పాల్గొన్నారు. అదేవిధంగా బొల్లారంలోని సదర్‌బజార్ మహంకాళి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జీవి బాల్‌రాజ్, నాగేందర్, జీవి వినోద్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రుద్రవీణ మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు శోభ, రామలీల

మహిళా భవన్ నిర్మించాలని వినతి

అడ్డగుట్ట, మే 27 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లో మహిళా భవన్‌ను నిర్మించాలని అడ్డగుట్ట శాస్త్రినగర్‌కు చెందిన రుద్రవీణ మహిళా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నక్కల శోభ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు రామలీలలు మంగళవారం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ అడ్డగుట్టలో దాదాపు మూడు వందల మహిళా గ్రూపులు ఉన్నాయని, మహిళలు సమావేశం ఏర్పాటు చేసేందుకు ఒక భవనం కూడా లేదన్నారు. మారేడుపల్లి రెవెన్యూ కార్యాలయం ఎదురుగా(డిల్లీ పబ్లిక్ స్కూలు ముందు) ఉన్న ప్రభుత్వ స్థలంలోని కొంత భాగంలో మహిళా భవన్ ఏర్పాటు చేయాలని మంత్రికి వివరించి వినతిపత్రం సమర్పించామన్నారు. అదేవిధంగా అడ్డగుట్టలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయడం జరిగిందని, సర్వే జరిపిన అసలైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.



ర్యాలీ అనుమతి కోసం ఏసీపీ సుబ్బయ్యకు వినతిపత్రం అందజేస్తున్న బాలల పరిరక్షణ వేదిక ప్రతినిధులు

నేడు మద్యం, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ

అడ్డగుట్ట, మే 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం, మాదక ద్రవ్యాల బారిన పడకుండా పిల్లలు, యువతను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాలల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి సిహెచ్ లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావులు అన్నారు. అడ్డగుట్టలో బుధవారం ఉదయం తుకారాంగేట్ నుంచి తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ వరకు విద్యావేత్తలు, మహిళా సంఘాలు, సామాజికవేత్తలు, వివిధ పార్టీల నాయకులతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీ అనుమతి కోసం సికింద్రాబాద్ గోపాలపురం ఏసీపీ సుబ్బయ్యకు ముందస్తుగా అనుమతి పత్రాన్ని అందజేశామని చెప్పారు. ఈ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొని మద్యం, మాదక ద్రవ్యాల నుంచి యువతను కాపాడుకుందామని ప్రజలకు సూచించారు.

ఎంఎంటీఎస్ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఎంఎంటీఎస్ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సఫిల్‌గూడలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం సఫిల్‌గూడ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని 45 ఏళ్ల వ్యక్తి రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళుతుండగా అటుగా వస్తున్న ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 27(ఆంధ్రజ్యోతి) : ప్లాట్‌ఫాంపై వస్తున్న రైలుకు ఎదురుగా వచ్చిన ఓ యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మంగళవారం ప్లాట్‌ఫాం నంబరు 10లో అసోంకు చెందిన ఓ యువకుడు నిలబడి ఉండగా ఆ సమయంలో ప్లాట్‌ఫాంపైకి వస్తున్న సెవన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ ముందుకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ ఇంతవరకు తెలియరాలేదని వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ దారిలో నడిచేదెలా!

- బురద, మురుగునీటి మయం
- సిమెంటు దిమ్మెలు, చెత్త కుప్పలు
- పట్టించుకోని అధికారులు



సిమెంటు దిమ్మెలను తొలగిస్తున్న దృశ్యం

పద్మారావునగర్, మే 27(ఆంధ్రజ్యోతి): ఆ దారంతా బురదమయం, చెత్త కుప్పలు, సిమెంటు దిమ్మెలతో అస్తవ్యస్తం. మరోవైపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదకరంగా మారింది. బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయగూడలోని టింబర్ ట్రేడింగ్ కంపెనీ నుంచి ఐడీహెచ్ కాలనీకి వెళ్లే దారిలో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. ముఖ్యంగా ఆ దారిన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. ఇలాంటి పరిస్థితులు ఉన్నా సంబంధిత అధికారులెవ్వరూ పట్టించుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

బోయగూడలోని టింబర్ ట్రేడింగ్ కంపెనీ నుంచి ఐడీహెచ్ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న వర్షపునీటి కాలువ శిథిలావస్థకు చేరి, నీటి సరఫరాకు అంతరాయం కలిగించడంతో కొన్నాళ్ల క్రితం దానిని పూర్తిగా తొలగించారు. దాని స్థానంలో 900 ఎంఎం ఆర్‌సీసీ పైపును ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో రోడ్డును తవ్విన అనంతరం సిమెంటు దిమ్మెలను, ఇతర వ్యర్థాలను రోడ్డు పక్కన వదిలివేయడం వల్ల రోడ్డు ఇరుకుగా మారింది. దీంతో వాహనదారులకు ఇబ్బందికరంగా, అలాగే వర్షపు నీరు రోడ్డుపై నిలుస్తోంది. వర్షం కురిసిందటే పరిస్థితి మరీ దారుణంగా మారుతుందనడంలో సందేహంలేదు. మురుగునీటి నిల్వల కారణంగా దోమల బెడద పెరిగింది. దోమల వల్ల ప్రజలకు ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టి ప్రజల ఇక్కట్లను తొలగించాలని కోరుకుంటున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ప్రతినిధి జీహెచ్ఎంసీ డీఈని సంప్రతించగా స్పందించిన ఆయన సోమవారం ఉదయం వ్యర్థాల తొలగింపు చర్యలను చేపట్టారు.



చెత్త, మురుగునీటిమయంగా ఉన్న బోయగూడ రోడ్డు, పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



సిమెంటు దిమ్మెలు, చెత్త కుప్పలతో బురదమయంగా రోడ్డు

అధికారి వివరణ

ఐడీహెచ్ కాలనీ రోడ్డులోని సమస్యను సోమవారం ఉదయం ఏఈ చైతన్యతో కలసి పరిశీలించాం. రెండు మూడు రోజుల్లో రోడ్డు పక్కన ఉన్న వ్యర్థాలను తొలగిస్తాం. మురుగునీటి పైప్‌లైన్ సమస్యను నివారించటానికి జలమండలి అధికారితో సంప్రతించి సమస్య పరిష్కారిస్తాం. ఆ తర్వాత సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి, సమస్యను శాశ్వతంగా పరిష్కరించటానికి చర్యలు చేపడతాం.

- ఆంజనేయులు, డీ.ఈ., జీహెచ్ఎంసీ

రోడ్డంతా బురద నడిచేదెలా?



బోయగూడ ఐడీహెచ్ కాలనీ రోడ్డు మొత్తం మురికినీటితో నిండి, బురదమయంగా మారింది. దీంతోపాటుగా దుర్గంధం వెదజల్లడం వల్ల ఆ దారిలో నడవలేని దుస్థితి నెలకొంది. మురుగునీటి నిల్వ కారణంగా దోమల బెడద పెరిగింది. మరోవైపు సిమెంటు దిమ్మెలు, చెత్త కుప్పలతో అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలి.

- డి.నర్సింగరావు, రిటైర్డు ఆర్టీసీ కండక్టర్, ఐడీహెచ్ కాలనీ

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేయాలి



బోయగూడ టింబర్ ట్రేడింగ్ కంపెనీ నుంచి ఐడీహెచ్ కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. వాహనదారులు, పాదాచారులకు ఇబ్బంది కలుగుతోంది. రోడ్డు పక్కన ప్రమాదభరితంగా ఉన్న మూడు ట్రాన్స్ ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేయాలి. మురికినీటి నిల్వ కారణంగా రాకపోకలు సాగించే వారికి విద్యుత్ ఘాతం కారణంగా ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. అధికారులు కంచెను ఏర్పాటుచేయాలి

- ఐతా చిరంజీవి, డివిజన్ కాంగ్రెస్ నాయకులు

వస్త్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలి



కేంద్రమంత్రి జితెన్ రామ్ మాంజీకి వినతి పత్రం అందిస్తున్న టీఎస్ఎఫ్‌సీసీటీ అధ్యక్షులు ప్రకాష్ అమ్మనబోలు, జీఎస్ నందకుమార్

రాంగోపాల్‌పేట్, మే 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం వ్యాపారులు, వస్త్ర పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ కామర్స్ & ట్రేడ్, తెలంగాణ స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్(టీఎస్ఎఫ్‌సీసీటీ) కోరారు. ఈ మేరకు మంగళవారం టూరిజం ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రి జితెన్ రామ్ మాంజీకి వినతిపత్రం అందించారు. అనంతరం ఎంజీ రోడ్డులోని తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమవేశంలో టీఎస్ఎఫ్‌సీసీటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్ అమ్మనబోలు, సి.నంద కుమార్‌లు మాట్లాడుతూ.. దేశంలో అతిపెద్ద ఉపాధి కల్పన, జీడీపీకి దోహదపడే రంగాల్లో ఒకటిగా ఉన్న టెక్స్‌టైల్ పరిశ్రమ ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటుందన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణం తీసుకోవాల్సిన చర్యల గురించి కేంద్రమంత్రికి వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. ఆ వినతి పత్రంలో అన్ని వస్త్ర ఉత్పత్తులకు జీఎస్టీని ఏకరీతిలో 5శాతానికి హేతుబద్ధీకరించాలని, చిన్న వ్యాపారులు, వస్త్ర యూనిట్లకు వర్కింగ్ క్యాపిటల్‌ను విస్తరించడానికి వివిధ క్రెడిట్ గ్యారంటీ పథకాల ద్వారా లబ్ధి కలిగించేలా బ్యాంకులను ఒప్పించేలా చేయడం, రుణ పంపిణీని సరళీకృతం చేయడం, రిటైల్ వ్యాపారులు, తయారీదారులకు సకాలంలో క్రెడిట్‌ను నిర్ధారించాలని కోరినట్లు వివరించారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటానని వాగ్దానం చేశారన్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం

- అన్ని రంగాల్లో భారత్ పురోగతి
- కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్
- ఐఎస్‌బీలో కేంద్ర ఆర్థిక గణాంకాల వార్షిక సర్వే ఫలితాల డేటాపై సదస్సు



సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ అనంత నాగేశ్వరన్

రాయదుర్గం, మే27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మందగమనం కొనసాగుతుంటే భారత్ అన్ని రంగాల్లో స్థిరమైన పురోగతి సాధిస్తుందని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి.అనంత నాగేశ్వరన్ అన్నారు. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ, జాతీయ గణాంకాల కార్యాలయం, ఐఎస్‌బీ, ఇన్‌కార్పోరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తాధ్వర్యంలో 2023-24 వార్షిక సర్వే డేటా ఫలితాలపై మంగళవారం ఐఎస్‌బీలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. తయారీ రంగంలో పటిష్టమైన మూల ధన వ్యయంతో సంస్థలు, మహిళా వ్యవస్థాపక వృద్ధిలో పురోగతి సాధిస్తుందన్నారు. ఇన్ కార్పోరేటెడ్, వ్యవసాయేతర రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధిస్తున్నామని ఈ సర్వే గణాంకాల డేటా వెల్లడిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న అనిశ్చితి యుగంలో భారత ప్రభుత్వ విధాన పరమైన సంస్కరణలు రూపొందించటానికి ఇటువంటి వివరణాత్మకమైన డేటా ఎంతో కీలకంగా మారుతుందన్నారు. గణాంక కార్యక్రమాల కార్యదర్శి డాక్టర్ సౌరబ్‌గార్గ్ మాట్లాడుతూ, ప్రభుత్వం పటిష్టమైన పురోగతికి అన్ని రంగాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించిన గణాంకాల డేటా భవిష్యత్తులో ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ డేటాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండిలో టీడీపీ సంగీత విభావరి

బౌద్ధనగర్, మే27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, నటసార్వభౌమ ఎన్టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకుని బుధవారం సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం వద్ద సాయంత్రం ఐదు గంటలకు సంగీత విభావరిని నిర్వహిస్తున్నామని టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, అధికసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



అహల్యాబాయి జయంతోత్సవాల్లో ప్రసంగిస్తున్న గీతామూర్తి

సనాతన ధర్మంపై అహల్యబాయి పోరాటాలు మరువలేనివి

మల్కాజిగిరి, మే 27 (ఆంధ్రజ్యోతి): సామాజికవేత్త అహల్యాబాయి హోల్కర్ సనాతన ధర్మంపై చేసిన పోరాటాలు మరువలేనివని బీజేపీ సంస్థాగత ఎన్నికల కోరిటర్నింగ్ అధికారి రాష్ట్ర బీజేపీ మహిళామోర్చా మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి అన్నారు. షంషాబాద్‌లో అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గీతామూర్తి మాట్లాడుతూ వందల సంవత్సరాల క్రితమే అహల్యాబాయి సనాతనధర్మంపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూనే అనేక గుళ్లను నిర్మించారని తెలిపారు. ఆమె జీవితం సనాతన ధర్మంపైనే కొనసాగిందన్నారు. కార్యక్రమానికి ప్రముఖ ప్రవచన కర్త డాక్టర్ అనంత లక్ష్మి, పంకజశ్రీనివాసన్, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు రాజ్‌గోపాల్‌గౌడ్, జిల్లా బీజేపీ మహిళా అధ్యక్షురాలు రమాదేవితో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



దేడ్‌లాక్ భవనం వద్ద తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం

బౌద్ధనగర్, మే 27(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి దేడ్‌లాక్ భవనం వద్ద మంగళవారం తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ సామల హేమ శంకుస్థాపన చేశారు. సుమారు ఆరు లక్షల రూపాయల వ్యయంతో పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేడ్‌లాక్ పరిసర ప్రాంతాల్లో పైపులైన్‌లలో కలుషిత నీరు సరఫరా అవుతుందని, అలాగే తాగునీరు లీకేజీ అవుతున్నాయన్నారు. ఈ కొత్త పైపులైన్ల ద్వారా సమస్యను నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ కుశాల్, నాయకులు శైలేందర్, కృష్ణముదిరాజ్, సాగర్, మహేశ్, పరుశరామ్, ఎర్రజ్యోతి, అనిత, జ్యోతి, లక్ష్మీ, సుజాత, అరుణ, లలిత, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.



మహానాడుకు తరలిన నాయకులు

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి మంగళవారం టీడీపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు గండికోట విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి



చిన్నారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న డాక్టర్ అపర్ణ

మై స్కూల్ ఇటలీ నిర్వాహకులపై దౌర్జన్యం

- సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు

బేగంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని రోడ్డు నెంబర్.25లో స్థలాన్ని లీజుకు తీసుకుని నిర్వహిస్తున్న మై స్కూల్ ఇటలీ విద్యాసంస్థ ప్రాంగణంలో స్థల యజమాని రోనక్ యార్‌ఖాన్ సహా అతడి అనుచరులు దౌర్జన్యం చేస్తున్నారని ఇటలీకి చెందిన ఎన్నారై డాక్టర్ వల్లూరు అపర్ణ సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణిలో ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే స్పందించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. బాధితురాలికి న్యాయం చేయాలని సైబరాబాద్ కమిషనర్‌కు సూచించారు.

భర్తను హత్య చేసిన భార్య

- గోడకేసి కొట్టి.. ఆపై గొంతు నులిమి



సభావత్ కిషన్ నాయక్ (ఫైల్)

వనస్థలిపురం, మే 27(ఆంధ్ర జ్యోతి): భర్తను గోడకేసి కొట్టి.. ఆపై గొంతు నులిమి హత్య చేసిందో మహిళ. అనంతరం ప్రమాదవశాత్తూ చనిపోయాడని పోలీసులతో సహా అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వనస్థలిపురం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం భావత్ తండాకు చెందిన ఆటో డ్రైవర్ సభావత్ కిషన్ నాయక్(40)కు కళతో 2005లో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. మొదటి భార్య మృతి చెందడంతో పిల్లలు ముగ్గురూ అమ్మమ్మ వద్ద ఉంటున్నారు. కిషన్ నాయక్ నగరానికి వచ్చి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇలా ఉండగా, యాదాద్రి - భువనగిరి జిల్లా గోకారం గ్రామానికి చెందిన శిరీషకు భర్తతో మనస్పర్థలు రావడంతో 2015లో విడాకులు తీసుకుంది. ఈమెకు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న కిషన్ నాయక్‌తో పరిచయం ఏర్పడటంతో 2015లో రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. వారు అమ్మమ్మ దగ్గర ఉంటున్నారు. భార్యాభర్తలు కిషన్ నాయక్ గ్రామంలో వ్యవసాయం చేసుకొనేవారు. ఈ క్రమంలో శిరీషకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కిషన్ నాయక్ భార్యను మందలించడంతో గొడవలు జరిగేవి. ఈ క్రమంలో రెండు నెలల క్రితం వనస్థపురంలోని హిల్‌కాలనీకి మకాం మార్చారు. కిషన్ నాయక్ సోమవారం సాయంత్రం మద్యం తాగి తన భార్య పనిచేసే చోటికి వెళ్లి ఆమెతో గొడవపడి ఇంటికి తీసుకొచ్చాడు. మరోసారి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తనపై అనుమానం వ్యక్తం చేయడమే కాకుండా ఆఫీసుకొచ్చి గొడవపడాడ్డని కోపోద్రిక్తురాలైన శిరీష భర్త కిషన్ నాయక్‌ను గట్టిగా గోడకేసి కొట్టింది. తర్వాత గొంతు నులిమి హత్య చేసింది. అనంతరం అంబులెన్స్‌లో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లింది. కిషన్ నాయక్‌కు పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఇలా ఉండగా, కిషన్ నాయక్ మొదటి భార్య కూతురు బిందు తన తండ్రిని శిరీష చున్నీతో హత్య చేసిందని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు శిరీషపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

30న చలో బోరిగాం పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ముథోల్ మండలం బోరిగాం గ్రామంలో మే 12న దళితులపై జరిగిన దాడిని ఖండిస్తూ ఈ నెల 30న చలో బోరిగాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వేదికగా ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్, వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు మానంపల్లి శ్రీకాంత్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కోట శ్రీనివాస్ గౌడ్, పీడీఎస్‌యూ నాయకులు సుమంత్, రుక్మత్ పాషా, బుద్దిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షులు మధాన్యూర్ రాహుల్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉదయ్, హరీష్, అఖిల్, ముత్యం, అరుణ్, అనిల్ శివ, శ్రీకాంత్ పాల్గొన్నారు.